
సాక్షి
బాపట్ల
మంగళవారం । 1 । అక్టోబర్ । 2024




సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 588.90 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 10,200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



వాహనాల తనిఖీ

మాచర్ల: పట్టణంలోని మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్ శేషారెడ్డి సోమవారం గుంటూరు, శ్రీశైలం, సాగర్ ప్రధాన రహదారిలో వాహనాల తనిఖీలు నిర్వహించారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 31,991 క్యూసెక్కులు వచ్చి చేరుతుండ గా దిగువకు 36,887 క్యూసెక్కులు వదులుతున్నారు.

న్యూస్‌రీల్

న్యాయమూర్తి ఆకస్మిక తనిఖీలు



వినుకొండ(నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాల మేరకు వినుకొండ మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్‌పర్సన్, వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎం.మహతి ప్యానల్ న్యాయవాదులతో కలిసి మండలంలోని విఠంరాజుపల్లి గ్రామంలోని సెయింట్ ఆన్స్ ఉషోదయ స్పెషల్ స్కూల్, నరసరావుపేట రోడ్డులోని బీసీ బాలుర హాస్టల్ స్కూల్, కాలేజీ, సోషల్ వెల్ఫేర్ బాలికల హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు ప్రతిరోజూ అందిస్తున్న మెనూను పరిశీలించి, సక్రమంగా అమలవుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకొని క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. బార్ అసోసియేషన్ సెక్రటరీ పఠాన్ గౌస్ మొహిద్దీన్‌ఖాన్, పి.వి.రమణారెడ్డి, ప్యానల్ న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

విజన్-2047పై జిల్లా స్థాయి పోటీలు




నరసరావుపేట ఈస్ట్: విద్యార్థుల్లో అవగాహన పెంపుదలలో భాగంగా రాష్ట్ర దార్శనిక పత్రం -2047 అంశంపై సోమవారం విద్యార్థులకు జిల్లాస్థాయి పోటీలు నిర్వహించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వం, బృంద చర్చ విభాగాలలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో వివిధ మండలాలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు హాజరయ్యారు. వ్యాసరచనలో ప్రథమ బహుమతి ఎస్.శృతిలయ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గురజాల, ద్వితీయ బహుమతి ఎం.హరిణి, జడ్పీ హైస్కూల్, గణపవరం, తృతీయ బహుమతి బి.రమ్య, శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్, అమరావతి సాధించారని తెలిపారు. వక్తృత్వంలో ఎం.శివసాయిశంకర్, జడ్పీ హైస్కూల్, శంకరభారతీపురం, జె.జయశ్రీ, ఏపీ మోడల్ స్కూల్, కండ్లకుంట, సిహెచ్.శృతిశ్రీ, జడ్పీ హైస్కూల్ కాకాని, బృందచర్చలో జి.మౌనిక, ఓ.హేమలత ప్రథమ, ఏ.నాగరూప, సిహెచ్.రాజేశ్వరి ద్వితీయ, కె.ఎస్తేరురాణి, పి.నందిని తృతీయ బహుమతులు సాధించినట్టు వివరించారు.

యార్డుకు 52,124 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 52,124 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 45,264 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.8,500 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.9,000 నుంచి 18,600 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 9,000 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,500 నుంచి రూ. 18,500 వరకు పలికింది. తాలు రకానికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 27,326 బస్తాల నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 5000 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 186, బ్యాంక్ కెనాల్‌కు 1,122, తూర్పు కెనాల్‌కు 105, పశ్చిమ కెనాల్‌కు 60, నిజాంపట్నం కాలువకు 116, కొమ్మమూరు కాలువకు 2280 క్యూసెక్కులు విడుదల చేశారు.

నష్టం కొండంత.. సాయం గోరంత

- వరద నష్ట నమోదులో వివక్షపై ఆగ్రహ జ్వాలలు
- తూతూమంత్రంగా వాహనాల నమోదు
- గృహాల నమోదులో నష్టానికి దక్కని పరిహారం
- మునిగిన గృహాలకూ రూ.10 వేలతో సరి



కొల్లూరు మండలం పెసర్లంక రామన్నపేటలో ప్రహరి కూలిపోయి పాక్షికంగా దెబ్బతిన్న గృహం

కొల్లూరు: కృష్ణానదీ వరదల బీభత్సం కారణంగా నిరాశ్రయులైన కుటుంబాలకు వాటిల్లిన నష్టం కొండతైతే.. ప్రభుత్వం అందిస్తున్న పరిహారం గోరంత మాత్రమే ఉండటంపై వరద పీడిత కుటుంబాలు నిరాశ, నిస్పృహలకు గురవుతున్నారు. వరదలు సృష్టించిన విపత్తు కారణంగా వాణిజ్య పంటలతోపాటు, గృహాలు ముంపు బారిన పడి కృష్ణా పరివాహక గ్రామాలలోని వేలాది కుటుంబాలు తీరని నష్టాలకు గురయ్యాయి. కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాలలోని 24 గ్రామాల పరిధిలోని 7,943 గృహాలు వరద నీట మునగడంతోపాటు, రూ. 9.52 కోట్లు నష్టం వాటిల్లిందని జిల్లా అధికారులు ప్రాథమిక నిర్ధారణకు రావడంతోపాటు, ముంపు గ్రామాలలో పర్యటించిన కేంద్ర బృందాలకు సైతం నివేదికలు అందజేశారు. గృహాలతోపాటు, వేల సంఖ్యలో విద్యుత్ మోటార్లు, భారీ



రెవెన్యూ కార్యాలయానికి తరలివచ్చిన వరద బాధిత మహిళలు

సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలు వరద నీటి ముంపు బారిన పడ్డాయి. అయితే వాస్తవ పరిస్థితులకు వచ్చేప్పటికీ గృహ నష్టాల నమోదులో నష్ట నమోదు చేపట్టిన బృందాలు అయిన వాళ్లకి ఆకుల్లో.. కాని వారికి కంచాల్లో అన్న చందంగా పక్షపాత ధోరణికి పాల్పడి నష్ట నమోదులో రాజకీయ వివక్షకు పాల్పడ్డారన్న అగ్రహావేశాలు ముంపు గ్రామాలలో వ్యక్తమవుతున్నాయి.

పరిహారం విషయంలో స్పష్టత కరవు..

కృష్ణా నదీ వరదల కారణంగా దెబ్బతిన్న పంటలతోపాటు, గృహాలు, ద్విచక్ర వాహనాలు, మరణించిన పశువులు, పశువుల చావిళ్లు, ఆటోలు, ట్రాక్టర్ల నమోదు విషయంలో మండల స్థాయిలో అధికారులకు స్పష్టత కరవైంది. ఓపక్క వాణిజ్య పంటలు సాగు చేసిన రైతులు తమ పంటలు నమోదు కాలేదని గగ్గోలు పెడుతుంటే, మరోపక్క రాజకీయ కోణంలో సాగులో లేని భూములకు సైతం పంట నష్ట నమోదు చేయడంపై అధికారులను బాధితులు నిలదీస్తున్నారు. గృహాల నష్ట నమోదు చేపట్టిన సమయంలో సాధారణంగా వరద ముంపునకు గురైన గృహాలు, పాక్షికంగా దెబ్బతిన్న గృహాలు, పూర్తిగా దెబ్బతిన్న గృహాలు అని మూడు విభాగాలుగా నష్ట నమోదు చేపట్టారు. అయితే ప్రభుత్వం విడుదల చేసిన నష్ట పరిహారం విషయంలో అన్ని గృహాలను ఒకే గాటన కట్టి రూ. 10 వేలు మాత్రమే గృహ నష్టదారుల ఖాతాల్లో జమచేయడంతో ప్రజలు జరిగిన నష్టంతో ప్రభుత్వం అందజేసిన పరిహారం పోల్చుకొని గొల్లుమంటున్నారు. అనేక ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలకు పరిహారం పంపిణీలో చోటు దక్కకపోవడంతో బాధిత ప్రజలు ప్రభుత్వ పరిహారం విషయంలో పూర్తి అసంతృప్తితో ఉన్నారు. తమకు గృహ నష్టం కింద రూ.10 వేల జమయ్యాయా, పాక్షిక, పూర్తి నష్టాల కింద నగదు జమయ్యిందా అన్న విషయాన్ని రూఢీ చేసుకునేందుకు లబ్ధిదారులు బ్యాంక్‌ల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి తలెత్తింది.



కొల్లూరు మండలం తిప్పలకట్ట ఎస్సీ ప్రాంతంలో వరద ముంపు నమోదుకు నోచుకోని పూరిల్లు

పూర్తి స్పష్టత కరవు..

గృహ, పంట, ఇతర నష్టాల విషయంలో ఎంత మంది లబ్ధిదారులకు, ఎంత మొత్తంలో నష్ట పరిహారం అందిందీ అన్న పూర్తి సమాచారం సైతం అధికారుల వద్ద కొరవడటంతో పరిహారం పంపిణీ విషయంలో పూర్తి స్పష్టత కరువైందన్న ఆరోపణలు వరద ముంపు బాధితుల నుంచి వ్యక్తమవుతున్నాయి. వరద ప్రవాహ వేగానికి ఇళ్ల గోడలు, ప్రహరీలు, వంటివి ధ్వంసమవడం, వస్తువులు, దుస్తులు, వంట పాత్రలు, ఎలక్ట్రికల్, ఇతర గృహోపకరణాలు తడిచి ముద్దయ్యి ఎందుకూ పనికిరాకుండా పోయి ఏర్పడిన నష్టం కారణంగా గృహాల యజమానులు రూ. లక్షల్లో నష్టాలను మూటగట్టుకొని ప్రభుత్వం తూతూ మంత్రంగా చెల్లించిన పరిహారంతో ఏమి చేయాలో పాలుపోని స్థితిలో ముంపు పీడిత ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు.

పరిహారం పెరగలేదు



వరద కారణంగా పూరింట్లో నివసిస్తున్న మేం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని డాబాలపైకి చేరుకొని ప్రాణాలు రక్షించుకోగలిగాం. వరద ప్రవాహం పెరగడంతో పూరింటి గోడలు పూర్తిగా కొట్టుకుపోయి, పైకప్పు మాత్రమే మిగిలింది. ఇంటిలో సామగ్రి మొత్తం వరద నీటి పాలవడంతో నిరాశ్రయులుగా మిగిలాం. ప్రభుత్వం రూ. 10 వేలు ఇవ్వడంతో మరమ్మతులు చేసుకోలేని పరిస్థితి.

– నల్లూరి శిరీష, కొత్తగూడెం, కొల్లూరు మండలం

ఆటో మునిగిపోయినా పరిహారం దక్కలేదు



వరదల కారణంగా జీవనాధారంగా ఉన్న ఆటో నీటిలో పూర్తిగా మునిగిపోయింది. తిరిగి మరమ్మతులు చేయించుకోవాలంటే ఆర్థిక పరిస్థితి సహకరించలేదు. అప్పులు చేసి మరమ్మతులు చేయించుకోవడానికి సిద్ధపడ్డాం. ప్రభుత్వం ఇళ్లు మునిగిన వారితోపాటు, వాహనాలు మునిగిన వారికి పరిహారం ఇస్తామని ప్రకటించినా, మునిగిన ఆటోను నష్ట పరిహార నమోదు బృందం నమోదు చేయకపోవడంతో పరిహారం అందకుండాపోయింది.

– పక్కలగడ్డ లక్ష్మీనారాయణ, పోతార్లంక, కొల్లూరు మండలం

నష్టానికి తగిన పరిహారం అందజేయాలి



కృష్ణానదికి అరవింద వారధి వద్ద నక్కపాయ గండికి ఏర్పాటుచేసిన అడ్డుకట్ట తెగిపోవడంతో నదీ ప్రవాహం మొత్తం దిశ మార్చుకొని గృహాలపైకి ఊహించని రీతిలో దూసుకువచ్చింది. నీటి ప్రవాహ వేగానికి చుట్టుపక్కల గృహాల ప్రహరీలు కూలిపోవడంతోపాటు, గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. నష్టానికి తగ్గ పరిహారం దక్క పోవడంతో తిరిగి గృహాలు చక్కదిద్దుకోవడం శక్తికి మించిన వ్యవహారంగా మారింది. రూ. లక్షకు పైబడి ఖర్చు చేస్తేగాని తిరిగి ఇళ్లు బాగుపడే పరిస్థితి లేదు.

– ననక వెంకటేశ్వరమ్మ, పెసర్లంక, కొల్లూరు మండలం

ప్రత్యేక జాబితాలో నమోదు



వరదల కారణంగా ఏర్పడిన నష్టపరిహారం విషయంలో ఇప్పటికే నష్ట నమోదు బృందాలతో అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించడంతో పరిహారం లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతుంది. నష్టం నమోదు చేయని పక్షంలో జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు విచారణ జరిపించి పరిహారం దక్కని విషయం వాస్తవమైతే నమోదు చేయడం జరుగుతుంది. బాధితులకు న్యాయం చేస్తాం.

– బి.వెంకటేశ్వర్లు, తహసీల్దార్, కొల్లూరు

శ్మశాన భూములను ఏర్పాటు చేయాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



సమస్యలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ఎస్సీ, ఎస్టీల గ్రామాలకు శ్మశాన భూములు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రాల ద్వారా కలెక్టర్‌ను అభ్యర్థించారు. 145 అర్జీలు నమోదయ్యాయి. తన పరిధిలోని వాటికి కలెక్టర్ తక్షణమే పరిష్కార మార్గం చూపారు. మిగిలిన వాటిలో కొన్నిటిని పరిశీలన, మరికొన్నిటిని విచారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శ్మశాన భూములు కావాలంటూ ప్రజల నుంచి వస్తున్న అభ్యర్థనలపై జిల్లా కలెక్టర్ స్పందించారు.

ఎస్సీ, ఎస్టీలు ఇబ్బందులు పడుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదు..

శ్మశాన భూములు లేని ఎస్సీ, ఎస్టీలు ఇబ్బందులు పడుతుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని జిల్లా కలెక్టర్ ప్రశ్నించారు. ప్రభుత్వ పోరంబోకు భూములను గుర్తించాలని, అలాంటి భూములు లేని పక్షంలో వాగు పోరంబోకు భూములను అధికారులు చూపాలన్నారు. వాగు పోరంబోకు భూములను అధికారికంగా ఇవ్వడం కుదరని నేపథ్యంలో పరివాహక ప్రాంతం వద్ద భూమిని కేటాయించిన తదుపరి అడంగులలో నమోదు చేయాలన్నారు. ముఖ్యంగా ఎస్టీలకు రేషన్ కార్డులు జారీ చేయాలన్నారు. ఆధార్ కార్డు లేకుంటే వారికి జనన ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి వెనువెంటనే ఆధార్ కార్డులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలన్నారు. గడువు దాటిన అర్జీలు జిల్లాలో ఉండరాదని హెచ్చరించారు. నాణ్యతతో పరిష్కరించక పోవడంతోనే 41 అర్జీలు పునరావృతం అయ్యాయన్నారు. నిర్లిప్తత వీడాలని ఆయన సూచించారు. అక్టోబర్ ఒకటో తేదీన మంగళవారం ఉదయం పింఛన్ నగదు పంపిణీ ప్రారంభించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఐదున్నర గంటలకే సచివాలయాల సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉండాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు క్షేత్ర పరిశీలన చేయాలన్నారు. జిల్లా జేసీ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, బాపట్ల ఆర్డీఓ పి.గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

వరద పరిహారం లోపాలపై ఎమ్మెల్యే వద్ద బాధితుల ఆవేదన



కొల్లూరులో ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు దృష్టికి వరద పరిహార నమోదులో లోపాలను తీసుకువెళుతున్న బాధితులు

కొల్లూరు: వరద పరిహారం నమోదులో లోపాలు చోటుచేసుకోవడంతో నష్ట పరిహారం అందకుండా పోయిందని వరద బాధితులు వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు వద్ద ఆవేదన వెళ్లగక్కారు. సోమవారం కొల్లూరు మండల పరిషత్తు కార్యాలయం వద్ద ఎమ్మెల్యేను మండలంలోని గాజుల్లంకకు చెందిన వరద ప్రభావిత కుటుంబాల సభ్యులు కలసి పంట పొలాలు, వాహనాలు, పశు నష్టం విషయంలో నష్ట నమోదు బృందాలు చేపట్టిన నష్ట నమోదులో పారదర్శకత లోపించిందని వాపోయారు. పంటలు సాగు చేసిన రైతులకు నష్ట నమోదు జరగకపోవడంతో పరిహారం దక్కకుండా పోయిందని, కొందరు వ్యక్తులకు మాత్రం పరిహారం అనుచితంగా వర్తించిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించిన ఆయన వరద ప్రభావిత కృష్ణా పరివాహక గ్రామాల్లో ఉన్న విస్తీర్ణానికి అనుగుణంగానే నష్ట నమోదు బృందాలు వేగవంతంగా నమోదు ప్రక్రియను పూర్తి చేశాయన్నారు. రైతులకు పరిహారం అందకుండా పోయిన పక్షంలో ఉద్యానవన శాఖాధికారులను విచారణ చేయమని సూచిస్తానని, వారు విచారణంలో వాస్తవమైతే నమోదు చేస్తారని వెల్లడించారు. ఉన్న విస్తీర్ణం కన్నా ఎక్కువ విస్తీర్ణంలో పంటలు నమోదు చేయాలంటే మాత్రం అది సాధ్యమయ్యే పనికాదని వెల్లడించారు. అనంతరం ముంపు బాధితులు ప్రభుత్వ శాఖల వారీగా అధికారులను కలసి నష్ట పరిహార నమోదు జాబితాలను తమకు అందజేయాలని, జాబితాలను పరిశీలించి ఉన్నతాధికారుల వద్దకు వెళ్లేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలు



రాష్ట్రస్థాయి పోటీలకు ముస్తాబైన పెద్దమక్కెన క్రీడాప్రాంగణం

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో అక్టోబర్ 1 నుంచి రెండు రోజుల పాటు 28వ రాష్ట్రస్థాయి అండర్ -19 సెపక్ తక్రా బాల, బాలికల రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి 13 జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు, అధికారులు హాజరు కానున్నారు. సత్తెనపల్లి ప్రగతి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఈ పోటీలు జరగనున్నాయి. దీనిలో భాగంగా సోమవారం క్రీడా ప్రాంగణాన్ని సిద్ధం చేశారు. అంతేగాక పోటీలకు హాజరయ్యే బాలబాలికలకు భోజనం, వసతులు కల్పించనున్నారు. మంగళవారం ఈ పోటీలను సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించనున్నారు. అక్టోబర్ 2న పోటీల ముగింపులో భాగంగా విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు హాజరు కానున్నారు. రాష్ట్రస్థాయి పోటీల ఏర్పాట్లను ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.నరసింహారావు పర్యవేక్షించారు. ఆయనతో పాటు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గ కార్యదర్శి అనిల్ దత్తానాయక్, మండల కార్యదర్శి లాకు పిచ్చియ్య, పీడీ పుచ్చకాయల శివరామకృష్ణ, తదితరులు ఉన్నారు.

ఎక్సైజ్ శాఖలో సీఐల బదిలీలు

నెహ్రూనగర్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో సీఐలను బదిలీలు చేస్తూ ఆ శాఖ డైరెక్టర్ నిశాంత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు- 1 సీఐగా బి. లత, గుంటూరు- 2కు ఎం. యశోధరాదేవి, ప్రత్తిపాడుకు వై. అశోక్‌కుమార్, మంగళగిరికి జి. వీరాంజనేయులు, తెనాలికి ఏ.వి.చలం, పొన్నూరుకు ఎం. రమేష్, బాపట్లకు పి. గీతిక, రేపల్లెకు ఆర్. దివాకర్, వేమూరుకు ఎ. రవి, నగరానికి ఎం. శ్రీరామ్‌ప్రసాద్, చీరాలకు పి.నాగేశ్వరరావు, పర్చూరుకు ఎం. భుజంగరావు, అద్దంకి ఎ. భువన, చిలకలూరిపేటకు కొడాలి వినయ్‌కుమార్, సత్తెనపల్లికి పి. విజయ్‌కుమార్, క్రోసూరుకు టి.తులసి, పిడుగురాళ్లకు కె. కర్ణ, గురజాలకు కె. బుజ్జిబాబు, మాచర్లకు ఎస్. వెంకటరమణ, వినుకొండకు డి. శ్రీనివాసరావు, ఈపూరుకు డి. వెంకటేశ్వర్లు, పెదకూరపాడుకు వి. శ్రీనివాసులును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్ఐల బదిలీలు

గుంటూరు- 1 ఎక్సైజ్ ఎస్ఐలుగా ఎండీ. ఖాశీం షరీఫ్, పి తిరుమలేశ్వరరావు, గుంటూరు -2కు సీహెచ్. మాధవి, పి.ఆర్.కె. మూర్తి, కె. సత్యనారాయణ, ప్రత్తిపాడుకు ఎం. రవీంద్రబాబు, మంగళగిరికి ఎ. పద్మజ, కె. రవికుమార్, జె. భాస్కర్‌రావు, తెనాలికి టి. ఫణికుమార్, ఆర్. శ్రీనివాసరావు, పొన్నూరుకు జి. శివరామ్‌ప్రసాద్ నియమితులయ్యారు.

ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐలుగా ఎస్‌డీ హెచ్ రెహీమాన్, ఎస్ శ్రీనివాసరావు, ఈఎస్‌టీఎఫ్ గుంటూరు ఎస్ఐగా పి. కృష్ణారెడ్డి, ఐఎంఎల్ గుంటూరు డిపో ఎస్ఐగా ఎ. శశికుమార్, నరసరావుపేట ఎస్ఐలుగా టి. తారాలక్ష్మి, కె. మురళీకృష్ణ, చిలకలూరిపేటకు సీహెచ్. దయాకర్, ఎం. గురవేశ్వరి, సత్తెనపల్లికి కె. నాగలక్ష్మి, క్రోసూరుకు టి. శ్రీనివాస్, పిడుగురాళ్లకు కె. కిరణ్‌కుమార్, గురుజాలకు ఆర్.వి.వి. ప్రసాద్, మాచర్లకు ఎండీ. యాకుబ్ షరీఫ్, వినుకొండకు సీహెచ్. వినీల, డి. శ్రీనివాసరావు, ఈపూరుకు కె. శ్రీనివాసరావు, పిడుగురాళ్లకు డి. పీరుహుస్సేన్, నరసరావుపేట ఈఎస్‌టీఎఫ్ ఎస్ఐగా ఈ. కళ్యాణ్ చక్రవర్తి, నరసరావుపేట ఐఎంఎల్ డిపో ఎస్ఐగా జె. మాధవి, విజయపురి సౌత్ చెక్ పోస్ట్ ఎస్ఐగా ఎస్.వి. సుబ్బారావు, పొందుగల చెక్‌పోస్ట్ ఎస్ఐగా సీహెచ్ అనిల్‌కుమార్‌లను నియమిస్తూ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు.

తెగుళ్లను తట్టుకునే రకాలు అందించాలి

- ఎన్జీరంగా వర్సిటీ వీసీ శారద జయలక్ష్మీదేవి
- రబీ పంటలకు సన్నద్ధంపై రైతులకు ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ శారద జయలక్ష్మీదేవి

గుంటూరు రూరల్: రబీలో తెగుళ్లను తట్టుకునే వివిధ పంట రకాలను రైతులకు అందించాలని ఎన్జీరంగా వర్సిటీ వీసీ ఆర్.శారద జయలక్ష్మీదేవి అన్నారు. ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో సోమవారం విశ్వవిద్యాలయం పరిధిలోని విస్తరణ విభాగం ఆధ్వర్యంలో రబీ పంటలకు సన్నద్ధం అనే అంశంపై ఒక్కరోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో సోయాబీన్ పంటపై పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. జీవన ఎరువులు, జీవ నియంత్రణపై రైతుల్లో అవగాహన కల్పించడం ద్వారా రసాయనాల వినియోగాన్ని తగ్గించవచ్చని చెప్పారు. ఖరీఫ్ పంట కాలంలో వాతావరణ పరిస్థితులు వల్ల చాలా ప్రాంతాల్లో అనేక పంటలకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. రానున్న రబీలో వివిధ పంటల సాగు విస్తీర్ణం, దిగుబడి పెంచే దిశగా శాస్త్రవేత్తలు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆమె సూచించారు. విశ్వవిద్యాలయం ద్వారా విడుదల చేసిన అధిక దిగుబడినిచ్చే రకాలు, టెక్నాలజీలను రైతులకు అందించాలని తెలిపారు. పరిశోధన సంచాలకులు పి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ పంటల సాగుబడి, వైవిధ్యం అనే అంశాలపై దృష్టి సారించి రైతుల ఆదాయం పెంచే విధంగా కృషి చేయాలని చెప్పారు. విస్తరణ సంచాలకులు జి. శివన్నారాయణ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల పరిధిలో ఉన్న వ్యవసాయ సమాచారాన్ని సేకరించి, వాటి నుంచి పరిశోధన, విస్తరణ అవగాహనకు కావాల్సిన విషయాలను గుర్తించాలని తెలిపారు. రైతు నికర ఆదాయం పెంచే విధంగా ప్రణాళికలతో విశ్వవిద్యాలయం ముందుకెళ్లడం ద్వారా వారికి మరింత చేరువకావచ్చని సూచించారు. మాజీ విస్తరణ సంచాలకులు ఆలపాటి సత్యనారాయణ మాట్లాడుతూ అపరాల సాగులో మెలకువలు, రకాలు తెలియజేశారు. బి.రోశయ్య పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణ, మందులు పిచికారీడ్రోన్ల ప్రాముఖ్యత తెలియజేశారు. జాతీయ వరి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.మహేంద్రకుమార్ మాట్లాడుతూ ఆరుతడి వరి పండించడం వల్ల ఉపయోగాలు, మెలకువలను వివరించారు. హైదరాబాద్‌కు చెందిన జాతీయ నూనె గింజల పరిశోధనా స్థానం శాస్త్రవేత్త జి. సురేష్ మాట్లాడుతూ నూనె గింజలు వాటిలో మేలైన రకాలు, సాగు మెలకువలు తెలియజేశారు. విశ్వవిద్యాలయ పరిధిలోని ఆరు జోన్లు నుంచి హాజరైన అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ శాస్త్రవేత్తలు ఖరీఫ్ పంట పరిస్థితి, రబీ పంట కాలంలో ఏఏ పంటలు పండించడానికి అవకాశాలు ఉన్నాయి, మేలైన రకాలు, విత్తన లబ్ధి, రైతుల వివిధ సమస్యలకు జవాబులు తెలియజేశారు. కార్యక్రములో రాష్ట్రస్థాయి విస్తరణ, పరిశోధన శాస్త్రవేత్తలు, వివిధ పరిశోధన స్థానాల అధికారులు, విశ్వవిద్యాలయ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి

కలెక్టర్ జె.వెంకట మురళి


విజేతలకు జ్ఞాపికలను అందిస్తున్న కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉందని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో గత నెల 18న విజయవాడలో నిర్వహించిన మారథాన్ 5 కేఎం విజయం సాధించిన జిల్లాలోని విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి మాట్లాడుతూ 5 కేఎంలో జిల్లాలోని చీరాల మహిళా కళాశాలకు చెందిన వి.చెన్ననీ రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం, రమ్యజోయ్ తృతీయస్థానం దక్కటం ఎంతో సంతోషకరమన్నారు. ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండటానికి ఆ శాఖ చేసిన ప్రయత్నం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ప్రఖార్ జైన్, జిల్లా వైద్యాధికారిణి డాక్టరు విజయమ్మ పాల్గొన్నారు.

మరొకరిని బలితీసుకున్న ప్రమాద ఘటన

మూడుకు చేరిన మృతుల సంఖ్య



రేపల్లె రూరల్: పెనుమూడి–పులిగడ్డ వారధిపై ఆర్టీసీ బస్సును మినీరవాణా వాహనం ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయాలపాలై గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రురాలు బచ్చలపూడి సౌజన్య సోమవారం మృతి చెందినట్లు పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. ఈ ప్రమాదంలో రేపల్లె మండలం పెద అరవపల్లికి చెందిన మాతంగి గంగాధర్, కృష్ణాజిల్లా పెడనకు చెందిన అతని మేనల్లుడు చెరుకూరి శ్యామ్‌లు ఘటనాస్థలంలో మృతి చెందగా సౌజన్య మృతితో మృతులు మూడుకు చేరాయని తెలిపారు. మృతుడు మాతంగి గంగాధర్ పెదనాన్న సంవత్సరిక కార్యక్రమానికి హాజరయ్యేందుకు తెనాలి నుంచి రేపల్లెకు వచ్చిన సౌజన్య ప్రమాదంలో కన్నుమూసింది.

ఏపీటీఐ రాష్ట్ర శాఖకు అవార్డు


అవార్డును స్వీకరిస్తున్న వెంకటరమణ

తెనాలి: అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా(ఏపీటీఐ) నిర్వహించిన 27వ జాతీయ ఏపీటీఐసీ వోఎస్ కార్యక్రమాన్ని ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని ఉత్కల్ యూనివర్సిటీలో ఈ నెల 27,28 తేదీల్లో నిర్వహించారు. ఇందులో ఏపీటీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖకు 2024కు ఉత్తమ అవార్డును ప్రదానం చేశారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ మోంటుకుమార్ ఎం.పటేల్, ఏపీటీఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మిలెన్డ్ జె.ఉమేకర్, ఏపీటీఐ సదరన్ రీజియన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.వెంకటరమణ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె.వెంకటరమణ అవార్డును అందుకున్నారు. ఆయన స్థానిక ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షులు డాక్టర్ వై.అంకమ్మచౌదరి, డాక్టర్ ఎ.లక్ష్మణరావు, కార్యదర్శి డాక్టర్ డి.నరేంద్ర, విమెన్స్ ఫోరం కన్వీనర్ డాక్టర్ కె.పద్మలత, సంయుక్త కార్యదర్శి కె.హిమబిందు పాల్గొన్నారు.

నాటు సారాపై ఉక్కు పాదం

- డీఎస్పీ పి.జగదీష్ నాయక్
- చీరాల టూటౌన్ పరిధిలోని రామ్‌నగర్‌లో కార్డెన్ సెర్చ్
- 2 వేల లీటర్ల బెల్లం ఊట, 30 లీటర్ల నాటు సారా స్వాధీనం


పాతిపెట్టిన బెల్లం ఊటను తీస్తున్న పోలీసులు


కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసులు

చీరాల: గంజాయి, నాటుసారా ఇతర అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయడమే లక్ష్యంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించామని డీఎస్పీ పి.జగదీష్ నాయక్ పేర్కొన్నారు. సోమవారం చీరాల టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామనగర్‌లో జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు 130 మంది పోలీసులతో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కార్డెన్ సెర్చ్‌లో నాటుసారా తయారీకి ఉపయోగించేందుకు సిద్ధంగా చేసి భూమిలో పాతిపెట్టి ఉంచిన సుమారు 2 వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అలానే 30 లీటర్ల నాటుసారాను సీజ్ చేసి అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి, నాటుసారా, ఇతర అసాంఘిక కార్యకలాపాల కట్టడికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

గతంలో చీరాల టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రామ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో నేరాలకు పాల్పడుతున్న కొంతమంది వ్యక్తులు నివాసం ఉండడంతో పాటు నాటుసారా తయారీ, గంజాయి క్రయ, విక్రయాలకు పాల్పడుతూ పలు కేసుల్లో పట్టుబడినారన్నారు. రామ్‌నగర్ పరిసర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి కార్డెన్ సెర్చ్ నిర్వహించామన్నారు. గంజాయి, నాటుసారా క్రయ విక్రయాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాల గురించి సమాచారం తెలిసిన వారు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో గాని, 100, 112లకు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సెర్చ్‌లో సరైన ధ్రువపత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలను సీజ్ చేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎస్.చంద్రమోహన్, చీరాల ఒన్‌టౌన్, టూటౌన్, చీరాల రూరల్, ఇంకొల్లు సీఐలు శ్రీనివాసరావు, నాగభూషణం, శేషగిరిరావు, రమణయ్య, అడ్మిన్ ఆర్ఐలు మౌలుద్దీన్, చీరాల వన్‌టౌన్, టూటౌన్, వేటపాలెం, ఇంకొల్లు, చినగంజాం పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు, సివిల్, ఏఆర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

ఎస్పీ తుషార్ డూడీ ఆదేశం


బాధితుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్లటౌన్: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 46 మంది బాధితులు ఎస్పీని కలిసి తమ సమస్యలను వివరించారు. బాధితుల సమస్యలు తెలుసుకున్న ఎస్పీ తుషార్ డూడీ సమస్యలను వెంటనే పరిష్కరించేలా కృషిచేస్తానని బాధితులకు హామీ ఇచ్చారు. అనంతరం జిల్లాలోని పోలీస్ అధికారులతో మాట్లాడి సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితులతో మర్యాదగా మసులుకోవాలన్నారు. చట్టపరిధిలో విచారించి బాధితులకు సత్వరమే న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, సీఐ యు.శ్రీనివాసులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పది నిమిషాల్లో వస్తున్నానని అనంత లోకాలకు..

- కనకదుర్గ వారధిపై రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- కడుపు కోతను మిగిల్చాడంటూ తల్లిదండ్రుల రోదన


కృప మనోజ్ (ఫైల్)

తాడేపల్లి రూరల్: పది నిమిషాల్లో వస్తున్నానన్నకొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సేకరించిన వివరాల ప్రకారం.. ఎన్‌టీఆర్ జిల్లా, విజయవాడ కృష్ణలంక బాలాజీ నగర్‌కు చెందిన సుధా బత్తుల శ్రీనివాసరావు, నాగలక్ష్మి దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడైన కృప మనోజ్ (21) డిగ్రీ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. కొడుక్కి ఉద్యోగం వస్తే చేదోడు వాదోడుగా ఉంటాడని ఫౌండ్రీ పని చేసుకునే శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు భావించారు. ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై కృప మనోజ్ వారధి మీదుగా తాడేపల్లికి వచ్చాడు. 11.30 సమయంలో ఇంటికి తిరిగి వెళుతుండగా గుంటూరు–విజయవాడ రహదారిలోని కనకదుర్గ వారధి 16వ నంబర్ పిల్లర్ వద్ద వెనుక నుండి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృప మనోజ్ రోడ్డుపై పడడంతో ఒకవైపు శరీరంపై లారీ టైర్ ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న తాడేపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి రోడ్డుపై మృతి చెందిన వ్యక్తి మనోజ్‌గా గుర్తించారు. మృతుడి జేబులో ఉన్న ఫోన్‌కు స్నేహితుల దగ్గర నుంచి ఫోన్ రావడంతో జరిగిన విషయం చెప్పడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు వచ్చిన మనోజ్ తల్లి నాగలక్ష్మి గుండెలు పగిలేలా రోదించింది. ''పది నిమిషాల్లో ఇంటికి వస్తానని చెప్పి మాకు కడుపుకోత మిగిల్చి.. అంతులేని లోకాలకు వెళ్లావా'' అంటూ మృతదేహంపై పడి దుఃఖించింది. పోలీసులు, బంధువులు ఆమెను సముదాయించి, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లంచాలు తిని కూడా పనులు చేయరా ?

వెలుగు సీసీ సుబ్బారావుపై మండిపడ్డ డ్వాక్రా గ్రూపు లీడరు దానమ్మ


సుబ్బారావుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రూపు లీడర్ దానమ్మ

ప్రత్తిపాడు: '' మా పని చేస్తామన్నారు.. చిన్నపాటి సంతకం కోసం రూ. రెండు వేలు లంచం తీసుకున్నారు.. లంచం తిని కూడా సంకతం చేయకుండా మూడు నెలలుగా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటారా? మా డబ్బులు మేం తీసుకోవడానికి కూడా ఇన్ని అగచాట్లా '' అంటూ ఓ డ్వాక్రా గ్రూపు లీడరు మూకిరి దానమ్మ వెలుగు సీసీపై మండిపడింది. వివరాల్లోకి వెళితే.. ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని రావిపాటివారిపాలేనికి చెందిన ప్రియాంక మహిళా గ్రూపులో ఎం. విజయకుమారికి స్త్రీనిధి కింద రూ.లక్ష రూపాయల రుణం మంజూరయ్యింది. రుణాన్ని గ్రూపు ఖాతాలోకి స్త్రీనిధి అధికారులు జమ చేశారు. గ్రూపు ఖాతా నుంచి వ్యక్తిగత ఖాతాకు నగదు బదిలీ చేసేందుకు సంబంధిత వీవో సీసీ సుబ్బారావును గ్రూపు లీడరు దానమ్మ సంప్రదించారు. అదిగో ఇదిగో అంటూ నెలల తరబడి ఆమెను కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. అయినప్పటికీ పని చేయకపోవడంతో సీసీకి లంచంగా రూ. 2 వేలు, వీవోఏకు రూ. 2 వేలు ఇచ్చింది. అయినా వారు సంతకాలు చేయకుండా తిప్పుకుంటూ రోజుకోరకం వంకలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సహనం కోల్పోయిన గ్రూపు లీడరు దానమ్మ సోమవారం వెలుగు కార్యాలయానికి వచ్చింది. సీసీపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పని చేసేందుకు రెండేసి వేలు డబ్బులు తీసుకుని కూడా చెయ్యరా.. అంటూ సూటిగా ప్రశ్నించింది. స్త్రీనిధి రుణం మంజూరు కావాలంటే బ్యాంకు లింకేజీ రుణం క్లోజ్ చేయాలని చెప్పడంతో అప్పులు తెచ్చి డబ్బులు కట్టానని, ఇప్పుడు స్త్రీనిధి రుణం తీసుకుందామంటే సంతకాలు చేయడంలేదని వాపోయింది. అధికారుల తీరుతో అటు బయట తెచ్చిన అప్పులకు, ఇటు స్త్రీనిధి రుణాలకు రెండింటికీ వడ్డీలు కట్టుకోలేని చికితిపోతున్నామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. స్పందించిన సీసీ బ్యాంకులో ఓడీ ఉన్నట్లు చూపిస్తుందని అందుకే ఇబ్బంది అవుతుందని, మేనేజర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని చెప్పడంతో ఆమె అక్కడి నుంచి వెనుదిరిగింది.

బాధితులకు రక్షణ కల్పించాలి

కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ


చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న కృష్ణ, చిన్నప్ప, వెంకట రమణ

సత్తెనపల్లి: దళిత యువకులపై విచక్షణారహితంగా దాడి చేసిన అగ్రవర్ణలను వెంటనే అరెస్టు చేసి బాధితులకు రక్షణ కల్పించాలని కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ డిమాండ్ చేశారు. రాజుపాలెం మండలం గణపవరం యువకుల దాడిలో గాయపడి సత్తెనపల్లి గవర్నమెంట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గడ్డిపర్తి సురేష్, పారనంది మరియదాసు, కటారి లక్ష్మయ్య, గడ్డిపర్తి సాల్మన్‌లను దళిత గిరిజన బడ్జెట్ వాచ్ ప్రతినిధులు మల్లెల చిన్నప్ప, మేడే వెంకటరమణ, మరియదాసు, దాసు, కేఎన్‌పీఎస్ సభ్యులు రాపూరి కిషోర్, చందులతో కలసి సోమవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 11 గంటలకు గణపవరం గ్రామంలో వైన్ షాప్ వద్ద ఉన్న చికెన్ షాపుకు వెళ్లినట్లు వివరించారు. ఆ సమయంలో నల్లూరి మోహన్, అతని కుమారుడు శ్రీను, ప్రసాద్, నల్లూరి శ్రీను, తమ గ్రామానికి చెందిన తాళ్లూరి రామనాథ్(మాదిగ) గొడవ పడుతున్నారని చెప్పారు. ఆ నలుగురు అడ్డం వెళ్లి గొడవెందుకని సర్ది చెప్పగా అది సహించలేని అగ్రవర్ణ కుల దురహంకారులు తమను కులం పేరుతో దూషించి దాడి చేశారన్నారు. నలుగురు యువకులను కనీసం ఒక కిలో మీటరు దూరం కొట్టుకుంటూ, ఈడ్చుకుంటూ వెళ్లి గ్రామం నడిబొడ్డున ఉన్న లైబ్రరీ గదిలో బంధించి ఒకరి వెంట ఒకరు గదిలోకి వచ్చి చెప్పులతో కొట్టారన్నారు. కాళ్ల చేతులతో ఇష్టం వచ్చినట్టు కొట్టారన్నారు. మహిళలను అవమానించారని, సుమారు వంద మంది చేసిన ఈ దాడిలో కేవలం నలుగురు అగ్రవర్ణ కులస్తులు పైన మాత్రమే రాజుపాలెం పోలీసులు ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని పై కృష్ణ మాట్లాడుతూ మాదిగ యువకులపై అగ్రవర్ణ కుల దురహంకారుల అమానుష దాడిని తీవ్రంగా ఖండించారు. పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని బాధితులకు రక్షణ కల్పించాలని కోరారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

- కాలిపోయిన రూ. 7 లక్షల నగదు
- 83 గ్రాముల బంగారం


కాలిపోయిన బీరువాను చూపిస్తున్న ఇంటి యజమాని

మంగళగిరి: గ్యాస్ సిలెండర్ పేలి కుమార్తె వివాహం కోసం ఇంటిలో ఉంచిన రూ. 7 లక్షలతో పాటు 83 గ్రాముల బంగారం, ఆస్తి దగ్ధమైన ఘటన మండలంలో నీరుకొండలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కురగంటి రమేష్ దంపతులకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరికీ వివాహమైంది. మూడో కుమార్తె వివాహం కొద్ది రోజుల్లో జరగనుంది. ఈ నేపథ్యంలో కురగల్లులో ఉన్న ఇంటిని రమేష్ రూ. 7 లక్షలకు విక్రయించాడు. నగదును బీరువాలో ఉంచాడు. సోమవారం కుమార్తెను చూసేందుకు పెళ్లి కుమారుడు, కుటుంబసభ్యులు రానుండగా వారికి అవసరమైన వంటలు చేసేందుకు రమేష్ భార్య గ్యాస్ వెలిగించింది. ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలుడుకు గురికావడంతో కుటుంబసభ్యులు బయటకు పరుగులు తీశారు. మంటలకు బీరువాలో ఉంచిన రూ. 7 లక్షలతో పాటు 83 గ్రాముల బంగారం, సామగ్రి కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటల్ని అదుపులోకి తెచ్చారు. తహసీల్దార్ షేక్ మాబు సుభాని ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

కుస్తీ పోటీల రాష్ట్రస్థాయి జట్ల ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, పీడీలు, పీఈటీలు

అచ్చంపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో సోమవారం జిల్లాస్థాయి రెజ్లింగ్(కుస్తీ) పోటీలు నిర్వహించారు. అండర్– 14, అండర్ – 17 విభాగాలలో బాలుర, బాలికల రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు.

అండర్– 14 బాలికల విభాగంలో.. విజయపురి సౌత్‌కు చెందిన బాలికలు ఎం.అనూష, బి.అలేఖ్య, ఎం.పూజిత, ఎస్.మేరీలేఖ, కె.నందిని ఎంపికయ్యారు. బాపట్లకు చెందిన శరణ్య, పి.రోజ,కె.శ్రీజ, అమరావతికి చెందిన ప్రవల్లిక ఎంపికయ్యారు.

అండర్– 14 బాలుర విభాగంలో.. అచ్చంపేటకు చెందిన పి.నాగచైతన్య, డి.గౌరిప్రతాప్, ఎ.ప్రణీత్, వై.మదన్, డి.సందీప్, అడవితక్కెళ్లపాడుకు చెందిన ఎం.జామ్ నాయక్, ప్రిన్సి, వి.ప్రవీణ్‌కుమార్, కె.అంకితరాజు, బి.సూర్యకృష్ణలు ఎంపికయ్యారు.

అండర్– 17 బాలికల విభాగంలో.. విజయపురిసౌత్‌కు చెందిన పి.కావ్య, బి.మాధురి, ఆర్.అనూష, ఎ.సంధ్య, అమరావతికి చెందిన ఎస్.పూజామహేశ్వరి, బి.లక్ష్మి, బాపట్లకు చెందిన సీహెచ్ రోస్లిన్, కె.రోజా, జి.అమూల్య, డి.ప్రిన్సి ఎంపికయ్యారు.

అండర్– 17 బాలుర విభాగంలో.. అచ్చంపేట గురుకుల పాఠశాలకు చెందిన ఎ.బాబు, కె.గోపయ్య, వి.పృథ్వి, బి.సంతోష్, కేవీఎల్ చక్రధర్, జి.జాన్సన్, డి.సుంధీర్, బి.ధనూష్, ఎం.వెంకటేష్, జి.డేవిడ్, ఎస్.వంసి, కె.అశోక్ కుమార్, ఎం.వరప్రసాద్, డి.కుమార్ బాబు, జె.కె.రామ్, జి.రాజు, తాటికొండకు చెందిన జి.చరణ్‌తేజ, అడవితక్కెళ్లపాడుకు చెందిన టి.పవన్‌కుమార్, అచ్చంపేట బ్లూబెల్స్ హైస్కూల్‌కు చెందిన వి.మహాదేవ్ ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు అక్టోబర్ 3,4,5 తేదీలలో కృష్ణా జిల్లాలోని నున్నలోని జిల్లా పరిషత్ హైస్కూలులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని రిటైర్డు పీడీ జి.భూషణం తెలిపారు.

ఆపదలో ఉన్నా.. ఆదుకోండి!

- 112కు ఫోన్ చేసిన మహిళ
- సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు
- పోలీసులపై దాడి చేసిన వ్యక్తి
- కానిస్టేబుల్ ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయని అధికారులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మెల్లెంపూడిలో నివాసముండే ఓ మహిళ తన భర్త నుంచి ప్రాణహాని ఉందంటూ ఆదివారం అర్ధరాత్రి 112కు ఫోన్ చేసింది. ఆమెతో పాటు ఆమె ఇంటికి ఎదురుగా ఉండే మరో మహిళ కూడా చేయడంతో జిల్లా కేంద్రం నుంచి తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కానిస్టేబుల్ గిరిబాబు మెల్లెంపూడి వెళ్లారు. మద్యం మత్తులో ఉన్న పోతురాజు బుజ్జి అనే వ్యక్తి ''మా ఇంటికి ఎందుకు వచ్చావురా?'' అంటూ దాడికి పాల్పడ్డాడు. జరిగిన ఈ సంఘటనపై కానిస్టేబుల్ గిరిబాబు తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో రాత్రి ఫిర్యాదు చేశారు.

ఆ సమయంలో బుజ్జిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు గానీ అతనిపై చర్యలు లేకుండా పంపించి వేయడంతో సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ నాయకులకు తలొగ్గి విధులు నిర్వహించడం అవమానంగా ఉందని వాపోయారు. కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడినా కనీసం డిపార్ట్‌మెంట్ అని సానుభూతి కూడా లేకుండా బుజ్జిని పంపించి వేడయంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేద పిల్లలకు ఉచితంగా వినికిడి పరికరాల పంపిణీ


యంత్రాలు అందజేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: పేద పిల్లలకు వినికిడి పరికరాలను స్వరూప స్వచ్ఛంద సంస్థ అందించడం అభినందనీయమని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. గుంటూరులోని ఏపీ ఎన్జీవో కల్యాణ మండపంలో సోమవారం సంస్థ ఆధ్వర్యంలో 150 మంది పిల్లలకు కోటి రూపాయల విలువ చేసే వినికిడి యంత్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఒక్కో పరికరం రూ. 60 వేలు ఉంటుందన్నారు. ఒక్కొక్క చిన్నారికి రెండు చెవులకు వినికిడి యంత్రాలు ఇవ్వడం వల్ల వారు సమస్యల నుంచి బయటపడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో మరో 15 నుంచి 20 మిషన్లు అందుబాటులో ఉంచగలిగితే పేదవారికి అందించడానికి అవకాశం ఉంటుందని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ పేద విద్యార్థులకు వినికిడి పరికరాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. సంస్థ కృషిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో స్వరూప చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సురేష్ పిల్లే, ఆర్‌బీఎస్‌కే నోడల్ జిల్లా ఆఫీసర్ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డైక్ సెంటర్ మేనేజర్ పావులూరి నాగ శిరీష, ఆడియాలజిస్ట్ శ్రీ నవ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

చిలకలూరిపేట: రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి అకాల మృత్యువాత పడిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు.. పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలోని గుర్రాలచావిడి ప్రాంతానికి చెందిన షేక్ ఖయ్యూమ్, నసీమా దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. వీరిలో పెద్దవాడైన షేక్ మొహమ్మద్ ఉమర్(19) గుంటూరు సమీపంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతూ కళాశాలకు చెందిన హాస్టల్‌లో ఉంటున్నాడు. రెండు రోజుల కిందట ఇంటికి వచ్చిన ఉమర్ ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి కళాశాలకు వెళ్తున్నట్లు చెప్పి బయలు దేరాడు. ఇంటి నుంచి బయలు దేరిన ఉమర్ ఓ మిత్రుడి జన్మదిన వేడుకలు ఉండటంతో మిత్రుల ఒత్తిడిపై నేరుగా కళాశాలకు వెళ్లలేదు. సాయంత్రం మిత్రుడి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నాడు. అక్కడి నుంచి మిత్రులంతా కలసి సెకండ్ షో సినిమాకు వెళ్లారు. సినిమా అయిపోయాక మరో మిత్రుడి సయ్యద్ షోయబ్‌తో కలసి స్కూటీపై బొప్పూడి ఆంజనేయస్వామి గుడి సమీపంలోని ఓ దాబాలో టిఫిన్ చేసేందుకు ఒంగోలు రోడ్డులో వెళుతున్నాడు. ఒంగోలు రోడ్డులోని రిలయన్స్ పెట్రోల్ బంకు సమీపంలోకి చేరుకున్నారు. అదే సమయంలో ఒంగోలు వైపు నుంచి అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు మధ్య డివైడర్ ఎక్కి పక్కరోడ్డులో ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మొహమ్మద్ ఉమర్ అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చొన్న షోయబ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.